# చిదంబర రహస్యం


పవని నిర్మల ప్రభావతి

ఎక్కడ చిదంబరం! ఎక్కడ గుంటూరు! ఇక్కణ్నుంచి అక్కడకు వెళ్ళాలని అదీ కేవలం ఓ వ్యక్తిని చూచేందుకు,ఆ వ్యక్తితో ఓ రోజంతా గడిపేందుకూ, వ్యక్తి ఇలాకా మరో "అజ్ఞాత" వ్యక్తిని చూచేందుకూ - నాలాటి రిటైర్డ్ గుమాస్తా ఆలోచించటం, అందుకుగానూ, కష్టార్జితంలో నుంచి సుమారు పదిహేనేళ్ళుగా పైసా పైసా కూడబెట్టి, ఈ ప్రయాణానికి సిద్ధంకావటం, యెవరేనావింటే హాస్యాస్పదంగానే వుంటుంది. కానైతే నాలా సాహిత్యపిపాస, ఆ సాహిత్యకారుల్ని చూడాలనీ, వారితో కొంతసేపు గడపాలనీ వుండేవారికి మాత్రం సబబుగానే వుంటుంది. నాలాటివారు యెందరుంటరన్నదే నాకు సందేహం! ట్రెయిన్‌లో, నూ, నా శ్రీమతి శారదా వెళ్తున్నాం. "మనం చిదంబరం వెళ్ళబోతున్నాం శారదా!" అని నేను వారం రోజులక్రితం టికెట్స్ రిజర్వ్ చేయించి చెప్పినప్పుడు శారద నావేపు నమ్మలేనట్లు చూచింది. శారద పన్నెండేళ్ళ పిల్లగా వున్నప్పుడు, అప్పట్లో పద్దెనిమిదేళ్ళుండే నాకు అర్థాంగిగా వచ్చింది. పెళ్ళంటే ఏమిటో సరిగా తెలీని వయసులో పసిపిల్లలా నన్ను అల్లుకుపోయిన శారద ఈ నలభై సంవత్సరాల మా దాంపత్య జీవితంలో, నే చెప్పిందే వేదంగా నడుచుకుంది. నాకళ్ళే తనవిగా, నా ఆలోచనలే తనవిగా మసలుకుంది. చాలా సందర్భాలలో శారద ఈ ఆత్మార్పణ, అమాయకత నాకెన్నో ఇబ్బందులనీ, చికాకులనీ కల్గించినా, అంతటి అమాయకపు ఇల్లాలికి ఏ క్షణంలోనూ ద్రోహం చెయ్యకుండా నన్ను నేను కంట్రోల్ చేసుకొందుకు కూడా ఆమె అమాయకత్వం పరోక్షంగా దోహదం చేసింది. శారద యెక్కువగా చదువుకోలేదు. ఆమెకు తెలిసిందల్లా స్త్రీల వ్రత కథలూ, కాశీమజిలీ కథలూ, భట్టివిక్రమార్క కథలూ,యాత్రా స్థలాల కథలూనూ! అందులో ఆమెకు చాలా ఇష్టమైనవి పుణ్యక్షేత్రాల కథలు. అవి యెక్కడ కనిపించినా చదువుతుంది. మన దేశంలోని పుణ్యక్షేత్రాలూ, ఆయా క్షేత్రాలలో వుండే క్షేత్రపాలకులైన దేవుళ్ళూ, దేవతలూ, వారికి చేసే పూజలూ వగైరా ఆమెకు చాలావరకూ కంఠతావచ్చు. అవి తను కళ్ళతో చూసినట్లు వర్ణిస్తుంది. నిజానికి ఆమె కవి చూడాలనీవుంది. అయితే, గుమాస్తాగా బ్రతుకు ప్రారంభించి, ముగ్గురు బిడ్డల తండ్రినై, ఇద్దరు మగపిల్లల్ని, ఒకర్ని లెక్చరరుగా, మరొకర్ని బ్యాంకి ఉద్యోగిగా చెయ్యటానికి, మూడవదైన ఆడపిల్లను మరో లెక్చరర్‌కిచ్చి పెళ్ళి చెయ్యటానికీ, అనుక్షణం అవినీతితో పోరాటం జరుపుతూ, నేనెన్ని బాధలు పడ్డానో, నా బాధల్లో పాలు పంచుకున్న శారదకూ తెలుసు! అంచేత మా జీవితంలో దూర ప్రయాణాలు, సరదా ప్రయాణాలు, అనే ప్రసక్తేలేదు! చాలా దగ్గిరి బంధువుల ఇళ్ళలో పెళ్ళిళ్ళకి కూడా ఓ "శుభాకాంక్ష సందేశం"తో సరిపెట్టేవాళ్ళం! హఠాత్తుగా చిదంబరం వెళ్తున్నామనేసరికి నిర్ఘాంతపోయింది. "నిజమా?" అంది. "నీతో అబద్ధం ఆడితే - నాకిక ఏ జన్మ వస్తుందో చెప్పలేను!" అన్నాను నవ్వుతూ టికెట్లు చూపించి.

"ఎన్నేళ్ళకి .... చిదంబరేశ్వరుణ్ణి చూచే అవకాశం కలిగింది! నాకెందుకో చిదంబ



టపాకాయ పేలనందువల్ల....



....ప్రమాదం ఎదురుగానే ఉంది

రేశ్వరుడంటే అపరిమితమైన భక్తి! చూడాలని కోర్కె కలిగాయి! "నందనార్" కథ చదివాను! చిదంబరక్షేత్ర మహత్యం గురించీ, అక్కడి నటరాజస్వామి గురించీ, ఆకాశ లింగం గురించీ, భూత నిర్మిత చిదంబరేశ్వరాలయం గురించీ విన్నాను. పత్రికలలో చదివాను! చిదంబరేశ్వరుడు-ఆకాశలింగం-చుట్టూరా తెరలు కడతారట! ఒక్క ఒక రాత్రిలో, పిశాచాలచేతా, భూతాలచేతా నిర్మింపచేశాడట ఆ తొమ్మిది ప్రాకారాలు, నాలుగు వాకిళ్లూగల మహోన్నత ఆలయాన్ని శివుడు! కాళీ అపరిమితంగా బలులు తీసుకుంటుంటే ఆమెతో పందెంవేసి, ఇరవై ఒక్క రోజులు నృత్యంచేసి, ఆమెను ఓడించి, చిదంబరం యెల్లదాటి వుండేటట్లుగా "ఎల్లకాళీ"గా కొలువబడేటట్లుగా ఆమెను పంపివేశాడట. ఆ నృత్య భంగిమలో నిలిచిన నటరాజ మూర్తినే మనం అన్నిచోట్లా చూస్తుంటాం! ఒక్కసారి చిదంబరేశ్వరుణ్ణి దర్శించి మనసారా మొక్కినవారికి జన్మజన్మల పాపం తొలగిపోవటమేగాక శివసాయుజ్యం లభిస్తుందట కూడాను!"

ఈ సారి విర్ఘాంతపోవటం నా వంతైంది. అస్తమానూ చాకిరీతో, సమస్యలతో నలియసూ శరీరమూ-కృంగదీసుకున్న శారదలో ఎంతటి వూహాచిత్రం వుంది! యెన్ని వివరాలు సేకరించింది? ఆ చిదంబరేశ్వరుణ్ణి చూడాలని యెంతటి తీవ్రకోరికవుంది....మరి నా కోరికా! చిదంబరేశ్వరుడి దర్శనం కంటే ముఖ్యమైంది ఆ వ్యక్తి-ఆ అజ్ఞాతవ్యక్తి దర్శనం! తర్వాతే చిదంబరేశ్వరుడు. అయితే ముందస్తుగా ఆ మాట చెప్పి శారద ఉత్సాహం మీద చన్నీళ్లు చిలకరించదల్చుకోలేదు! జన్మకో శివరాత్రి అన్నట్టు మా నలభై ఏళ్ళ దాంపత్య జీవితంలో ఆమెకు సంతోషం కలిగించేలా, చేయబోతున్న దూరప్రయాణమూ, పుణ్యక్షేత్ర దర్శనమూ ఇదే మొదటిది, ఇదే ఆఖరు కూడాను! పిల్లలు ముగ్గురూ యెవరి సంసారాల్లో వారు మునిగివున్నారు. మగపిల్లలిద్దరూ చెరో యాభై పంపిస్తారు నెలకు. నా పెంక్షన్ డబ్బు, నేను నా కష్టార్జితంలో నిలబెట్టిన "ఇల్లు" అనబడే రెండుగదుల గూడు— ఇప్పుడు డబ్బుకు కటకటే! ఏడువందల రూపాయలు కూడబెట్టగలిగానంటే, నన్ను నేనే అభినందించుకోవాలి....నా స్వంతఖర్చులకీ సరదాలకీ (అవసలు లేవు) పిల్లల్ని ఇబ్బందిపెట్టే మనస్తత్వం కాదు నాది....

అసలాయనగారితో ముఖాముఖి పరిచయం కాకముందే, ఆయన వ్రాసిన పుస్తకాలెన్నో చదివాను! రఘునాధరావు ఆయనగారి పేరు! ప్రాచీన, ఆధునిక సాహిత్యం కాచి వడపోసిన దిట్ట! ఆయన వ్రాసిన ప్రతిపుస్తకమూ హిందూ సమాజానికీ, హిందువుల జీవిత విధానానికీ ప్రతిబింబం! కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ ఆయనఎన్నుకోని కథావస్తువే లేదు! భారతజాతి సమగ్రచరిత్రను నవలలో అతి హృద్యంగా చూపగల మహామేధావి ఆయన! అలాగని ఆ నవలలు చదివేటప్పుడు విసుగు కలగదు. చరిత్ర చదువుతున్నామా? అన్న సందేహం రాదు! విచిత్రమైన పాత్రలు, విభిన్న మనస్తత్వాలు. ఒక్కో పుస్తకం ఒక్కో రసవద్గుళిక! రసహృదయులకు రమణీయ కానుక! ఉపనిషత్తులు, మంత్రాలూ, పూజలూ, జపాలూ, శృంగారం, వీరం, హాస్యం. ఒకటేమిటి ఆయన స్పృశించని అంశమే లేదు! సాధికారంగా బోధించని విషయమే లేదు! కొన్నివేల కుటుంబ సమస్యలలో నాకున్న ఒకేఒక రిలీఫ్ పుస్తకపఠనం! ముఖ్యంగా రఘునాధరావుగారి పుస్తకాలు. భాష గ్రాంధికమూ వాడతారాయన! వ్యావహారికమూ, గ్రామ్యమూ కూడా వాడతారు. అటు నవలగానూ మలుస్తారు ఆధునికుల కోసం! ఇటు కావ్యంగానూ శోభింపచేస్తారు ప్రాచీనతంటే ప్రాకులాడేవారి కోసం! అందుకే అవి కావ్యాలు కావు, నవలలు కావు సాహిత్యాకాశంలో వెల్లివిరిసిన అసమాన ప్రతిభకు తార్కాణాలు! తారకలు!

ఓ రోజు ఆయనగారికి టౌన్‌హాల్లో సన్మానం జరగబోతోందని తెలిసింది! పదిహేను సంవత్సరాల క్రితం జరిగిందా సంఘటన! అంతక్రితం ఆయనగారివి రెండో మూడో చదివాను పుస్తకాలు....ఈ మధ్య కాలంలో చాలా చదివాను! మొదట్లో రాసినవి ఓ మోస్తరుగా వున్నాయి .... ఈ మధ్య కాలంలో రాసినవి . అత్యద్భుత సృష్టిలాటివి! అంతటి గొప్పమనిషి-గొప్పవారింట్లోనే బస చేస్తాడు కదా సహజంగా! అక్కడ కల్సుకొనేందుకు లేదు. సభలోనే చూశానాయన గారిని, కిటకిటలాడిపోతోంది సభ! అజానుబాహువు! వెలిగిపోతున్న ముఖవర్చస్సు! ఒత్తైన గిరిజాల జుట్టు! నలభై ఏళ్లు పైబడినా, నవయువకుడిలా వున్నాడు! అంతటి గర్వమూ (అహం) తొణికిసలాడుతోందా మాటలలో ఉపన్యాసంలో....అవును మరి! అత్యద్భుత పుస్తకాలు వ్రాయగలిగిన కళ వుండగా ఆపాటి "అహం" వుండటం సహజం. రెండుచేతులా డబ్బు సంపాదిస్తూ సన్మానాలూ కనకాభిషేకాలూ, చేయించుకుంటుంటే సహజంగా వుండే "కాన్ఫిడెన్స్" అది అనుకున్నాను. ఆయన ఆధునిక, ప్రాచీన సాహిత్యంమీద యిచ్చిన గంటన్నర ఉపన్యాసం శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసింది! చప్పట్లతో హాలు మారుమ్రోగిపోయింది! అందరూ ఆటోగ్రాఫుకోసం ఎగబడ్డారు! నేనూను!

అందరితో మధురంగా మట్లాడుతూ, మధురంగా నవ్వుతూ బయటికివచ్చారు. ఆయనగారి కోసం వచ్చిన కారు దగ్గరకు నేనూ ఎలాగో సందుచేసుకుని వెళ్ళి ఓ నిమిషం మాట్లాడాను. ఆయనగారి పుస్తకాలు ఏయే సంస్థ ప్రచురించిందో భోగట్టా సేకరించాను.

"ఇంతటి మహామేధావి మీరు ఆంధ్రులై వుండీ, చిదంబరంలో ఎందుకు స్థిరపడ్డారు?" అన్నాను ధైర్యంచేసి.

"అదే చిదంబర రహస్యం!" (ఏ వయసులోవున్న స్త్రీనయినా పులకింపచేసే అతి హుందా అయిన నవ్వు....) "....మరేం లేదు....నా శ్రీమతికి చిదంబరేశ్వరుడి మీద తగని భక్తి! ఓ చిన్న వ్యాపారం పెట్టాం. అక్కడ కలిసివచ్చింది. అక్కడే స్థిరపడిపోయాం! కాకున్నా, రవిగాంచనిచోట కవి కాంచునట్టివాడు కవి! అతగాడు ఏ ప్రాంతంవాడు కానీ, ఏ ప్రాంతంలో అతగాడుండాలని కానీ నియమం లేదు—వుండకూడదు!" అన్నారాయన సరదాగా నవ్వుతూ! అందరితో చెప్పినట్లే నాతోనూ "చిదంబరం వస్తే తప్పక మా ఇంటికి రండి! ఎంతైనా మనం మనం ఆంధ్రులం అన్న అభిమానం అంతరాంతరాలలో వుండనే వుంటుంది!" మళ్ళీ నవ్వారు. అందరం నవ్వాము ప్రీతిగా. ఎవరో అడిగారు "మీ ప్రతి నవల, నవల కానీ కావ్యం అంటాను,అసభ్యంగాని శృంగారం-అత్యంత సౌందర్యలోకాలు-ప్రపంచంలో మనం ఎక్కడేనా, యెప్పుడేనా చూస్తామా అన్నంతటి అద్భుత ప్రదేశాల వర్ణన రమణీయకత—వెల్లివిరుస్తుంటాయి....అంతటి రస సృష్టి చేయటంలోగల-రహస్యం మామీకో చెప్పగలరా?"

అందు కాయనగారు అంత మధురంగా నవ్వారు. చుట్టూరా ఓసారి చూచి ఏదో రహస్యం చెబుతున్నట్లు అన్నారు. "ఇక్కడందరం మగాళ్ళమే వున్నాం కాబట్టి, ఆ రహస్యం యేమిటో చెబుతాను.... అబద్ధాలాడటం నా కిష్టం వుండదు..." (ఈ మాటలతో కాస్తంత దూరంగా వున్న స్త్రీలు కూడా కొందరు చెవులు రిక్కించటం నేను గమనించాను.)

"అలసాని పెద్దన మొదలు-ఈనాటి నా వరకూ....యెవరేనా కానీండి—కళాకారునికి వెనకాల ఓ ఇన్స్పిరేషన్ వుంటుంది.... అలాగే నాకూను "ఆమె....". ప్రతి కళాకారుని వెనుకా వుండే రహస్యమే ఇది!"

పకపక నవ్వుతూ ఆ అజ్ఞాత "ఆమె"ను గురించిన వివరాలేమీ చెప్పకుండా శ్రోతల్ని అద్భుత సస్పెన్స్‌లో ముంచి, ఆయన కారులో కూర్చున్నారు. కారు వెళ్ళనిమ్మన్నారు!

శ్రోతలందరికీ ఆయనగారి "ఫ్రాంక్‌నెస్, నిజాయితీ" చాలాచాలా నచ్చాయి.

"ఆమె" భార్యమాత్రం కాదన్నది అర్థం అయింది! నాకు చాలా ఈర్ష్యకూడా కలిగిందాయనగారిమీద క్షణంలో! నా వయసువున్నా ఆయనగారిలో ఆ అహం—ఈ ఫ్రాంక్‌నెస్ ....బహుశా "ఆమె"వల్ల ఏర్పడినవే కావచ్చు! సాంప్రదాయం పేరుతో ఇలా పసి వాళ్ళకి ముడెట్టి—మగాడిలోని "కళ"ను సమూలంగా నాశనంచేసే పెద్దవాళ్ళమీద కోపం కూడా వచ్చింది! ముద్దులాటి శారదమీద తాత్కాలికమైన కోపమూ, అసహ్యమూకూడా కలిగాయి! నాక్కూడా "ఆమె" లాటి స్త్రీ ఒకర్తె వెనకాల వుంటే-ఆ ఇన్స్పిరేషన్‌తో నాలో యెంతటి "కళ" ఎలాటి అద్భుత "కళ" పైకి వచ్చేదో నన్న వూహ,బాధతో, చాలా రాత్రులు అసంతృప్తితో, అనీజీగా ఫీలయ్యాను! తిరిగి బ్రతుకుతెరువు సమస్యలు మెడమీద తన్నుతుంటే—ఆయనగారిగురించీ "ఆమె" గురించీ ఆలోచనలు కట్టిపెట్టాను. అయితే, ఆయనగారి పుస్తకాలు వదలకుండా చదవటం—చదివిన ప్రతిసారీ, ఆయనగారి "ఆమె" గురించి ఆలోచించటం, వాళ్ళిద్దరినీ చిదంబరంలో చూడాలనీ, "ఆమె" యెవరేనా కానీ—చేయెత్తి మొక్కి "నీ జన్మ ధన్యమైంది అమ్మా!"అని చెప్పాలని అనిపించటంఅదో ప్రగాఢకోర్కెలా స్థిరపడిపోవటం జరిగిపోయింది! ఓ విధంగా ఆయనగారి సాహిత్యానికి నేను "అడిక్ట్"నై పోయాన్నా తప్పులేదు! ఆ బలవత్తర కోర్కె ఈ రోజు నాచేత ఈ ప్రయాణం చేయిస్తోంది! శారద మాత్రం చిదంబరేశ్వరుణ్ణి గురించి, తను చదివినవీ, విన్నవీ-ఆపకుండా ఏకరువు పెడుతోంది బ్రెయిన్ చప్పుడుతో సమానంగా. విని విని....అన్నాను.

"శారదా! చిదంబరం వెళ్ళాక—మొదటి రోజే మనం చిదంబరేశ్వరుణ్ణి దర్శించటం వీలుపడదు!"

"అదేం....?" అంది శారద అమాయకంగా.




"మనం ముందస్తుగా ఓ మహోన్నత వ్యక్తిని కలుసుకోవాలి! ఆయనగారితో ఓ రోజంతా గడపాలి! తర్వాత చిదంబరేశ్వరుడి విషయం...."


శారద కొంచెం నిరుత్సాహంగా అంది. "ఇంతదూరం వెళ్ళటం ఓ వ్యక్తిని చూడటానికా? కనీసం మనం అక్కడున్న రెండు రోజుల్లో రెండు మార్లన్నా స్వామిని దర్శించి ...." శారద మాటలకు అడ్డొస్తూ అన్నాను. "స్వామి ఎక్కడికీ వెళ్ళడు! గుడిలోనే వుంటాడు. ఆయనగారలా కాదు! మన అదృష్టంకొద్దీ ఇంట్లోనేవుంటే - ఆ అద్భుత వ్యక్తిత్వాన్ని మరింతగా దగ్గరగా చూచే అవకాశం కలుగుతుంది! నీకెందుకు?నీ చిదంబరేశ్వరుణ్ణి నీకు చూపిస్తాగా!"

శారద మాట్లాడలేదు....ఈ నలభై ఏళ్ళలోనూ యెప్పుడూ శారద యెక్కువగా తర్కం చెయ్యలేదు. ఇష్టంవున్నా, లేకున్నా-నే చెప్పింది వినటమే....అది నమ్మటమే, చెయ్యటమే ఆమెకు తెలిసినపని!

నాకు శారదకు చూస్తుంటే జాలి కలిగింది! ఈ అమాయకురాలికి రఘునాధరావుగారు సృష్టించిన మహోన్నత సాహిత్యం బొత్తిగా తెలియదు-అసలే సాహిత్యమూ తెలియదు. ఆయనగారిని చూపాలి.... "ఆమెను" చూపాలి! కొంచెం లోకజ్ఞానం కలిగించాలి!

* * *

పుణ్యక్షేత్రమూ అందునా, భాషరాని ప్రదేశమూ కావటంతో, బ్రెయిన్ దిగిందే




మొదలు సత్రంలో రూము సంపాదించుక బస ఏర్పాటుచేసుకొనేవరకూ యెన్నిరకాల మోసాలకు గురికావాలో, అన్ని రకాల మోసాలూ చవిచూశాం, నేనూ, శారదా! చౌకగా వుంటుందని సత్రం అనుకున్నామే గానీ, అక్కడా పీక్కుతినట చూశాక, ఏదేనా లాడ్జిలో బసచేసినా బావుండేదనిపించింది!

బస్సు నెంబర్లు కనుక్కుని రఘునాధరావుగారుండే వీధికి దగ్గరగా "స్టాప్"లో దిగాము నేనూ, శారదా! ముందస్తుగా ఉత్తరం రాయలేదిలా వస్తున్నట్లు. రాసినా, ఆఫ్టరాల్ ఓ రిటైర్డ్ గుమాస్తా....సుమారు పదిహేను సంవత్సరాలక్రితం..

"గుంపులో గోవిందా" అంటూ చూచిన నన్ను ఆయన గుర్తుతెచ్చుకొని సాదరంగా "రండి" అంటూ జవాబిస్తారన్న నమ్మకం లేదు. ఎలాగైనా ఈరోజు ఆయనగారితో గడిపి-"ఆమె"ను ముఖాముఖి పరిచయం చెయ్యమనికోరాలి! ఈక్షణంలో అదృష్ట దురదృష్టాల్ని నమ్ముతున్నాను నేను! ఆయనగారు ఇంటి దగ్గరుంటే-కేవలం అది నా అదృష్టం-ఇంత దూర ప్రయాణం-కష్టార్జితం డబ్బు! శ్రమ-అన్నీ ఫలించినట్లే!

బస్ స్టాప్‌లోదిగి, సందులూ గొందులూ వెతతిరిగాం! అరవం మాట్లాడరాదు. తెలుగొచ్చిన తెలుగువారు ఒకరిద్దరు కనిపించినా, వాళ్ళూ తమిళంలోనే మాట్లాడటం బాధనిపించింది. శారదకూ, నాకూ నీరసం వచ్చింది. ఎండకు తల తిరుగుతోంది కూడాను! ఏభై యెనిమిదేళ్ళ వయస్సున్న నేనూ, ఏభై రెండేళ్ళ వయసున్న శారదా, అలా శ్రమపడటం యెందుకని కూడ చిరాకేసింది నామీద నాకే! అంతలో యెవరో అడ్రస్ కాగితం చూచి, ఇల్లు గుర్తులుచెప్పి పుణ్యం కట్టుకున్నారు. ఆ ఇల్లుచూచి, అది రఘునాధరావుగారి ఇల్లంటే ముందస్తుగా నమ్మలేను నేను. మా ఇల్లంతదే! కాకుంటే పైనకూడా రెండుగదులు ఓవరండా వుందల్లే వుంది. తలుపు తట్టగానే, పనిమనిషి వచ్చి తలుపుతీసింది.

"ఎవరు కావాలి?" అంది అరవ యాసలో.

"రఘునాధరావుగారు....వారిల్లు ఇదేనా?" అడిగాను సందేహం వదలక.

"మేడ మీద వున్నారు" మెట్లకేసి చూపించి. మా ఇద్దరివేపూ నఖశిఖ పర్యంతం పరికించి చూస్తోంది గుడ్లగూబలా! రఘునాధరావుగారిలాంటి గొప్ప వ్యక్తి, అందునా కులాసా పురుషుణ్ణి, కలుసుకోవటానికి వస్తూ, నేనూ, శారదా, మా కున్నంతలో గొప్ప బట్టలే వేసుకున్నాం.

మేడమెట్లు మలుపు తిరిగేచోట, శారద గుసగుసగా అంది. "అబ్బ! ఏంమనిషండీ! తాటకిలా! ఆ ముక్కూ! గుడ్లగూబలా ఆ చూపూ, ఆ ఒళ్ళూ, నలుపూ....దెయ్యంలా ఆ జుట్టుముడీ కలలోకి వచ్చేలావుంది. మనిద్దర్నీ అలా దిష్టితగిలేలా చూస్తోందేమిటి?"

"దిష్టితగిలేంత గొప్పగా లేములే మనం! పనిమనిషితో మనకేమిటి! పద! ఇప్పుడు నీకో అద్భుతం చూపిస్తాను!" అన్నాను నేను గుసగుసగా!

మేడగదిలోకి అడుగెట్టబోతూ మర్యాద సూచకంగా అడిగాను "మేం లోపలకి రావచ్చా?" అంటూ!

లోపల్నుంచి పురుషకంఠం "రండి!" అంది. వెళ్ళాము; ఈజీచైర్‌లో పడుకున్న వ్యక్తిని చూడగానే....నాకేమిటోగా అనిపించింది. మాసిపోయిన పంచ, యెదమీద అలాటిదే మాసిన తుండుగుడ్డ....పెద్ద జబ్బుపడి లేచినవాడిలా నీరసించి, కళా విహీనంగా వున్న ఆయనగారే రఘునాధరావుగారంటే నమ్మ శక్యంకాలేదు! కానీ గదిలో గోడకు వ్రేళ్ళాడుతున్న ఆయనగారి లైఫ్ సైజు ఫోటో....ఆరోజు సభలో చూచిన ఆయనగారి రూపం .... ప్రతిబింబిస్తోంది— ఆ పోలికలు కొన్ని ఈ వ్యక్తిలోనూ వున్నాయి కాబట్టి నమ్మక తప్పలేదు....ఈ పదిహేనేళ్ళలో అతి విషాదకర సంఘటనేదో జరిగిపోయిందా? "ఆమె" కేదేనా ఆపద సంభవించిందా? ఈ గది చూస్తుంటే- ఆయనగారి ఆర్థికస్థితి చాలా అన్యాయంగా, వున్నట్లు తెలుస్తోంది....గది సరిగా వూడ్చినట్లు కూడా లేదు. శిథిలాలలో వున్నట్లుంది ప్రాణం.

"ఏవూరు? ఏంకావాలి?" రఘునాధరావుగారు ఈజీచేర్‌లో కొద్దిగా లేచి కూర్చుని నిర్లిప్త ధోరణిలో అడిగారు

"మూర్తి నాపేరు! ఈవిడ నా భార్య శారద....పదిహేను సంవత్సరాలక్రితం...." నా పరిచయం సవివరంగా చేసుకున్నాను.

ఆయనగారికి నేనెవరో గుర్తురాలేదు. రాకపోవటం సహజమే. "ఓహో! మీరా! ఎంతశ్రమ తీసుక ఇక్కడికి వచ్చారు. చిదం రేశ్వరుణ్ణి చూద్దామని వచ్చారా యాత్రకు? చాలా సంతోషం!" అన్నాడు లేచి నిల్చుంటూ! గుప్పాలా వున్నాడనిపించింది ఆనాటి ఆ దర్పం, ఆ రాజసం....ఆ ఠీవి, ఆ కాన్ఫిడెన్స్ ఏవీ?

"అబ్బే! మిమ్మల్నీ చూద్దామని...." అన్నాను. ఆయన చూపించిన చాపమీద కూర్చున్నాం.

"మీ పుస్తకాలన్నీ చదివేశాను! ఇప్పుడు కొత్తగా ఏం రాస్తున్నారు!" నా కళ్ళు గోడలమీద ఫోటోలకేసి నిదానంగా చూస్తున్నాయి. "ఆమె" వుందేమోనని....

నాతో గుసగుసగా అంది "మీరు మగాళ్ళు, మీ పుస్తకాల సంగతులు మాట్లాడుకోండి. నేను కింద వీరి ఆడవాళ్ళతో మాట్లాడుతుంటాను. చిదంబరేశ్వరాలయానికి ఎప్పుడు వెళ్ళాలో, ధర్మదర్శనం యెప్పుడో అన్నీ వివరాలు కనుక్కుంటానీలోగా! మీ మాట లయ్యాక, వెళ్ళేముందు, నన్ను పిలవండి!" అంటూనే లేచి వెళ్ళిపోయింది కిందికి. అదే మంచిదనిపించింది నాకు. శారద పక్కన వుండగా "ఆమె" గురించి ఆయనగారు ఫ్రీగా చెప్పరేమో, పరిచయం చెయ్యరేమో నని!

"మీరెందుకో చాలా చిక్కిపోయారు! పదిహేనేళ్ళలో చాలా మారిపోయారు!" అన్నాను.

ఆయనగారు నవ్వారు. ఆ నవ్వు అతి విషాదంగా ఉంది. "వయసుపైబడలేదూ?"

"మీకూనా?" ఆశ్చర్యంగా అడిగాను.... "మీరు కళాస్రష్టలు! నిత్యయవ్వనులు! మాబోటివారి సమస్యల్ని-అవలీలగా పరిష్కరించే మార్గదర్శకులు....మీకూ వయసు పైన బడుతుందంటే నమ్మలేకుండా వున్నాను!" అన్నాను.

ఇంతలో ఇందాకటి పనిమనిషి వచ్చింది మంచినీళ్ళు తీసుక.

ఆయనగారో గ్లాసు తీసుక, నాకూ ఇమ్మన్నారు.

"ఒద్దులెండి! నాకు దాహంగా లేదు!" అన్నాను! ఆ మనిషి చూస్తూ ఆ చేతినీళ్ళు తాగటంకూడా అసహ్యమే ననిపించింది.

ఆమె బయటికి వెళ్ళినట్లే వెళ్ళింది.... "ఇట్లారా!" అంది మెట్లదగ్గరగా నిల్చుని. మెట్లకూ గదికీ అట్టే దూరంలేదు. ఆయన గారు లేచివెళ్ళారు.

"ఎంతిస్తాడట!"యాస తెలుగులో అడుగుతోంది.


"హుష్! మెల్లిగా! ఇంకా అడగలేదు" రఘునాధరావుగారి గొంతుక.

"తొరగా అడిగెయ్! తేరగా రాస్తా వేమిటి పుస్తకాలు!" అలాగే పెడుగుపడ్డట్లు ఆమె.

"నువ్వు కిందికెళ్ళు....నే చూసుకొంటాలే అసలు వీళ్ళు నన్ను చూడటానికొచ్చారు.... పుస్తకాలు అచ్చేసే పబ్లిషర్స్ కాదు!"

"కారు! ముఖాలు చూసే అనుకున్నా! నిన్ను చూసేదేమిటి? "నటరాజ"ను చూడాలి

టపాకాయ పేలింది!....



....ఏమైంది! పక్క పేజీలో చూడండి

గానీ!"

ఆమె విసురుగా వెళ్ళిపోయినట్లుంది!

ఆ గదే తిరుగుతోందో, నేనే తిరిగిపోతున్నానో....నా కర్థంకాలేదా క్షణంలో....

ఈవిడ భార్యా? అందుకేనా ఆయనగారు "ఆమె"ను ఎన్నుకున్నది!

నా వూహ నిజమైతే—ఇలాటి భార్యను పీక పిసికి చంపినా హత్యా దోషం అంటుకోదు...

ఆయనగారు గదిలోకి వచ్చారు....పాతాళానికి కుంగిపోయినవాడిలా! నేను వాళ్ళ సంభాషణ విననట్లు నటించటమే ఉభయులకూ హాయిగా ఉందా క్షణంలో!

"మీతో మనసా మాట్లాడాలనీ....మీ సాహిత్య కృషికి మూలంగా మీరానాడు చెప్పిన అజ్ఞాతవ్యక్తి "ఆమె"ను చూడాలనీ వచ్చాను నిజానికి!" అన్నాను తెగించి.....

ఆయనగారు మౌనంగా లేచివెళ్ళి, గదిలో మూలగా పెట్టివున్న పెద్ద చెక్కపెట్టెలోవున్న ఫోటో ఒకటి తెచ్చి నా చేతికిచ్చారు....కుతూహలంగా చూశాను. ఆ ఫోటో పాతదే అయినా, ఎక్కువగా మాసిపోలేదు. అదాయన గారు చాలా జాగ్రత్తగా దాచినట్లు స్పష్టమౌతూనే వుంది. ఫోటోలో వున్న ఆవిడ-చాలా అందంగా వుంది. పూర్వకాలపు నగలతో నిండుగా వుంది. అరకాసంత కుంకుమ బొట్టుతో, పట్టు చీరెతో—నా శారదలాటి అమాయకపు చూపులతో,అతి గౌరవనీయురాలైన ఇల్లాలిలా వుంది. గౌరవభావం తప్ప మరోటి కలగదామెను చూస్తే! ఈయనగారికి ఈవిడ ఇన్స్పిరేషన్ అంటే నమ్మటం కష్టం....

"ఈమె...."నా భావాల్ని చదువుతున్నట్లు అన్నారాయన.

"నా భార్య! కానీ యిప్పుడు లేదు. చనిపోయింది...."

"అహా!...." అన్నాను యేమనాలో తోచక.


"ఆవిడ వుండగా నేను రచనలు మొదలెట్టాను. ఒకటి రెండు రాశాను....అయితే అవి అంత జనాదరణ పొందలేదు. కారణం తర్వాత వ్రాసినవాటిల్లోవున్న అద్భుత భావాల లహరి వాటిల్లో లేదు...."

నేను శ్రోతలా మిగిలిపోయాను!

"మీ కుతూహలం నాకు తెలుసు. మీరు "ఆమెను" చూడటానికి వచ్చారు. ఇంత దూరం శ్రమపడి నాకోసం వచ్చారు! నేనా రోజు వూరించిన "చిదంబరరహస్యాన్ని" తెలుసుకోవటానికి వచ్చారు! ఇంత సిన్సియారిటీతో వచ్చిన మీకు అబద్ధాలూ, అభూత కల్పనలూ చెప్పటం నా కిష్టంలేదు! అయితే నాదో చిన్న కోరిక. లేదూ, మనవి....మీరు విన్నవీ, చూచినవీ, ఇక్కడే మర్చిపొండి!" ఆయనగారి కంఠస్వరం బాధతో కంపించింది.

తలూపాను!

"ఆవిడ వుండగా, చల్లని వెన్నెల వాగు నా చుట్టూరా వుండేది! నా భార్య పేరు సరస్వతి. సరస్వతి-మృదువైన వ్యక్తిత్వం.



మధురమైన ప్రేమ—నేను తప్ప మరో ఆలోచనలేని ఆమె ఆత్మార్పణ ...నిజంగా నన్ను రచనకు పురికొల్పలేదు—పైసినా ఏదో చప్పగా రాయాలని గింజుకుని రాసినట్లుగా మాత్రమే వుండేది! ఆమె జీవించి వున్నంత కాలం ఆమె ప్రేమలో ఈదీతుణ్ణయి పోయాను .... ఆమె చనిపోయింది .... నా రచనా ప్రవంతి ఆగిపోతుందనుకన్నాను.... కానీ మరింతగా విజృంభించింది. నా భార్య లేని లోటు అప్పుడు తెలిసివచ్చింది ....''

నేను లోలోపల కొంత సంతోషించాను. ఆయనగారిక ఆ రెండవ "ఆమె" ను గురించి చెప్పబోతున్నారు.... చెవులింత చేసుకు వింటున్నాను....

"అహం కొందరిని ఆకాశానికెత్తి, హఠాత్తుగా అగాధాలలోకి విసిరేస్తుంది. నా భార్య జీవించి వుండగా వ్రాసిన ఐదారు నవలలకే నాకు పెద్ద గుర్తింపు సన్మానాలు ప్రారంభ మయ్యాయి....అసలే అందగాణ్నేమో.... ఆ పైన ఓవర్‌కాన్ఫిడెన్స్ .... విశృంఖల ప్రణయాలు ప్రారంభించాను... కొంతవరకూ అవీ నా రచనకు ఉద్దీపనాలు కాకుండా మొదలెట్టాయి! హఠాత్తుగా యెలా పడ్డానో తెలీదు ..."ఆమె"తో అనుకోని ఆవేశంలో-హద్దులేని "పిచ్చి"లో ఓ వలలో పడ్డట్లు పడ్డాను....ఆమె నా జీవితంలో జబర్దస్తీగా చోటు చేసుక్కూర్చుంది! నేను తనని వదిలినా, ఆమె నన్ను వదలనంతగా నన్ను పట్టి వేసింది....ఇక్కడ నేను "కర్మ" సిద్ధాంతాన్ని నమ్మవలసి వచ్చింది! ఒకానొక బలహీన క్షణమో—ఒకానొక సంస్కార బలమో, ఒక్కోసారి మనల్ని శాశ్వత బందీలుగా చేస్తుంది. కాదంటారా?'' ఆయన గారు క్షణంకాలం ఆగారు.

"అవును" అన్నాను పెద్ద అనుభవం వున్నట్లు! అయితే నాకు ఒకటి మాత్రం సంతోషాన్ని కలిగిస్తోంది. "ఆమె" ఆయన గారినలా బంధించకపోయి వున్నట్లయితే, అంతమంచి కావ్యసృష్టి, సాహిత్యసృష్టి చేసే వారుకారేమో! ఏమైనా ఆమె ధన్యజీవి! ఆమెను త్వరలోనే చూడబోతున్నాను.... ఇంత చెప్పినాయన "ఆమె"ను నాకు చూపించకపోరు!

"ఆమె కంటికి కనిపిస్తే చాలు....నా రక్తం సలసల మరుగుతుంది .... కలం చిందులు తొక్కుతుంది! నా భార్యతో నేను పొందిన అత్యద్భుత అనుభూతులేకాక—నేనే కాదు—ఏ రే మానవుడూ భూత భవిష్యత్ వర్తమాన కాలాల్లో, చవిచూడని, చూడలేని-ఒకానొక సున్నిత శృంగారం తదనుగుణమైన పాత్రలూ—కలంలోనుంచి జాలువారుతాయి! అందుకు దోహదకారి అయిన ప్రకృతి.... అదెక్కడుందో....నిజంగా నాకూ తెలియదు-ఏవో చరిత్ర ఆధారాలు మనసులో మెదులుతాయి ఆ రమణీయ ప్రకృతికీ, ఈ చరిత్రకూ అంటుకడతాను .... ధీర, గంభీర, శూర, శృంగార, కరుణ, రౌద్ర రసాలు వెల్లివిరిసే పాత్రలెన్నో నాకు మారుగా నాకలంలోనుంచి వూహాచిత్రాలుగా వెలువడుతాయి! ఫలితంగా మీ కళ్ళముందుకు ఓ కమనీయ కావ్యం వస్తుంది! నాకు చేతినిండుగా డబ్బు వస్తుంది ....ఆ డబ్బు...''

ఆయనగారు భావావేశంలో వున్నట్లు చెప్పుకుపోతుండగా .... ఓ పదహారేళ్ళ అమ్మాయి వచ్చింది. ఇందాకటి పనిమనిషి కూతురేనని ఇట్టే పోల్చుకోవచ్చు...."నిన్ను అమ్మ రమ్మంటోంది!" మొరటుగా యాసగా, ఆయనతో అంది.

"ఓ పదినిముషాల్లో వస్తున్నానని చెప్పు!" చిరాగ్గా పంపేశారాయన.

"మీరిందాక చెబుతున్నారు....ఆ డబ్బు" అందించాను నేను. రసవత్తర కావ్యం మధ్యలో ఆగిపోతుందేమోనని నా భయం....

"ఆఁ ఆ డబ్బు....ఇదిగో ఈ పిల్లది.... దాని చెల్లెలొకర్తె....వున్నారు .... వాళ్ళ పెళ్ళికి... నెల ఖర్చులుపోను కూడబెట్టాలి!"

"ఆహా! రఘునాథరావూ! నీ వ్యాపారం చితికిపోయి వుండవచ్చు. నీ భార్య పోయిన దుఃఖంలో వ్యాపారంమీద నిర్లక్ష్యం వహించి వుంటావు....కానీ—నీ పనిమనిషికోసం.... దాని పిల్లలకోసం....వాళ్ళ పెళ్ళిళ్ళకోసం ఎంత యాతన పడ్డున్నావయ్యా! ఎంత దాతృత్వం నీది!" అనుకున్నాను లోలోపల!

"ఇందాక చూచినావిడ మా పనిమనిషి.." అన్నాడాయనగారు మెల్లగా!

"ఊహించుకున్నాను!" నా సాహిత్య పరిజ్ఞానం బయటపెట్టాను....

"మీరూహించుకోలేనిది ఒకటుంది....అదే నా కథలోని థ్రిల్! నా భార్య బ్రతికుండగా, ఆ తర్వాతా—ఆమె పనిమనిషే! ఆ తర్వాత ....ఇందాక చెప్పాను చూడండి—మనిషిని అహం నిలువెల్లా కప్పేసిన క్షణంలో.... మంచి చెడుల విచక్షణ జారిపోయిన క్షణంలో ....కామం కళ్ళను కప్పేసిన క్షణంలో—ఆ పనిమనిషి...."ఆమె"గా మారి ...కొండచిలువలా చుట్టేసిన క్షణం...."

నా కళ్ళు బైర్లుకమ్మినట్లయ్యాయి! కొన్ని వేల ఆటంబాంబులు నా నెత్తిమీదే పేలినట్లైనాయి....పండగవేళా శుభమా అని అభ్యంగనం చేయబోతే,కుంకుడురసం కళ్ళనిండుగా, నోటినిండుగా పడినట్లైంది! కాకరాకు పసరెవరో బలవంతంగా గొంతుకలో పోసినట్లైంది....

"ఆమె....ఈమెనా?" నేనే అడిగానో.... అడిగినట్లు భ్రమపడ్డానో నాకు తెలియదు.

"ఔను!ఈమెల స్తమానూ నా కళ్ళముందు మెదుల్తుంటుంది పీడకలలా! ఒకానొక దరిద్రపు పనికి సాక్షీభూతంలా! నా పరువు బజారున పడటం,"ఈమె"ఇంట్లో తిష్ఠవెయ్యటం, వ్యాపారం స్థంభించటం—రాబడి తగ్గటం, ఈమె ప్రతిబింబంగా ఇద్దరు అమ్మాయిలు పుట్టడం....అన్నీ నా నవల యెంత వేగంగా, అద్భుతంగా వెలువడ్డాయో, అంతటి వేగంగానూ, సహజంగానూ జరిగిపోయాయి! దేశమంతటా సన్మానాలు నాకు! మరోవేపు నన్ను నేను పూరడించుకుంటూ "ఆమె" గురించి నాకు నేనే గొప్పలు చెప్పుకుంటూ, వేషం మెయిన్‌టైన్ చేసే యాతన!ఆ సమయంలోనే మీరు నన్ను చూశారు! నాలో లేనివన్నీ, నా నవలల్లోనూ, నాలోనూ చూపాలనే తపనలో మీరు నన్ను చూశారు!

"ఇప్పుడేం రాస్తున్నారన్నారు? ఇందాక!

చాలాచాలా రాస్తున్నాను-రాయక ప్పుదు.... ఆఇద్దరమ్మాయిల పెళ్ళి బాధ్యత న మీదుంది! భూతాల్ని అణచాడట ఇక్కడ చి దంబరేశ్వరుడు! భూతాలమధ్య—దివ్యకావ్యా న్ని సృష్టిస్తున్నాను నేను! భూతాలచేత చి దంబరేశ్వరాలయం నిర్మింపజేశాడంటారు! ఈ భూతాలు నాచేత అత్యద్భుత కావ్యసృష్టి చేయి స్తున్నాయి! నేను రాస్తాను! ఏంరాస్తాను? నా అందుబాటులో లేని సౌందర్యాలు, ప్రక ృతి సౌందర్యాలు. స్త్రీపురుషుల అత్యద్భుత గ ుణగణాలు ....అవన్నీ రాస్తాను....ఈ భూతా కి డబ్బొక్కటే కావాలి! అవి కంటికి కనిపి స్తున్నంతసేపూ... కలం దించకుండా రాయా అనిపిస్తుంటుంది....ఇప్పుడు చెప్పండి "ఆ మె" నా ఇన్స్పిరేషన్ కాదంటారా? ఆమెన ుంచి కాదా నేను ఉద్దీపన పొందటం?" ఆ యనగారు హఠాత్తుగా పకపక నవ్వారు....ఇప ్పుడానవ్వు ....ఆరోజు ఆయనగారు కారు ఎ క్కబోతూ నవ్విన నవ్వులా ధ్వనించింది....లో పలిభారం దిగిపోవటంతో కాబోలు—స్వచ్ఛ ంగా నవ్వ గలుగుతున్నారు....

"పిటీ మిమ్మల్ని గురించి కల గుతోందీ క్షణంలో నాకు! "ఆమె" గ ురించీ నా గురించీ .... మీరు ఎంత గొప్పగా వూహించుకున్నారో నాకు తెలుసు! మీలాటి సహృదయులైన పాఠకులు ఈ కఠోర సత్యాన్ని తట్టుకోలేరు! అందుకే ఇక్కడి దిక్కడే-ఈ చిదంబర రహస్యాన ్ని చిదంబరం దాటేలోగా....మర్చిపొమ్మ ని కోరుతున్నాను! మీకంటే యింకా సున్నిత హృదయుడైన పాఠకుదెవరేనా-ఇ ంతదూరం ఇదే పనిమీద వస్తే-ఈ కథంతా చె ప్తాను.... మీకు చూపానే....నా భార్యఫోట ో....అది చూపిస్తాను. "ఆమె....ఆమే!" అ ంటాను!" చెప్పవలసింది అయిపోయినట్లు లేచ ారాయన. "ఎక్కడదిగారు?" అన్నారు చివర ి! సత్రం పేరు చెప్పి, రేపు సాయంత్రం ొళ్ళిపోతా మని చెప్పి, శలవు తీసుకుని కి ందికి దిగి వచ్చాను. శారదను పిలవందే ఆలస్ య మన్నట్లు వచ్చింది....ఇద్దరం రోడ్డెక్కాం. బస్స్టాప్ వరకూ నడవాలి....నడుస్తున్నాం. శారద అంది "ఆవిడ పనిమనిషని అన ుకున్నాం కాదండీ? పనిమనిషి కాదుట! ఆ యనగారి భార్యేనట! ఆ ఇద్దరు పిల్లలూ? పిల్ల లా? ఆడపిశాచాలు! యెవరికి వాళ్ళు నోరు తె రిస్తే ఏం బండ మాటలండీ బాబూ! ఇం త బండ మాటలూ, బండతిట్లూ తిట్టే ఆడవా ళ్ళని మరి మశం చూడం! ఆయనగారేదో ు స్తకాలు రాస్తారట గదా? ఆ పుస్తకాలకు సరిగా డబ్బు రావటం లేదట! ఎవరూ యెక్కువగా ఇవ్వటం లేదట! సంసారం జరగాలి. పిల్లల పెళ్ళిళ్ళు అంటూ, ఆయనగార్ని బండబూతులు తిట్టేసిందా ండ నా ముందే! కొత్తవాళ్ళ ముందే ఇ లావుందే ఇక ఇంట్లో మామూలుగా యెలా వుం టుందో ఆ మహాతల్లి!" హఠాత్తుగా చెప్ప టం ఆపి, రోడ్డుమీద నిల్చుండిపోయి శా రద అడిగింది "ఇంతకూ ఏదో అద్భుతం చూపిస్తానన్నారు....ఇదే వీధా? మరో వీధా?" అంటూ అమాయకంగా! నాకు నా శారద దేవతలా....సాక్షాత్తూ దేవతలా తోచిందీ క్ ణంలో!

* * *

చిదంబరేశ్వరుణ్ణి దర్శించుకు వద్దామని సిద్ధమవుతున్నాం ఉదయాన్నే. సుడిగాలిలా వచ్చారు ర ఘునాధరావుగారు సత్రంలో మా గదిలోకి!

"మీరు మరోలా అనుకోకండి మూర్తి గారూ! ఏ నం మనం ఆంధ్రులమన్న అభిమానం కొద్దీ వచ్చాను! చాలా యిబ్బందిగా వుంది. రావలసిన బుక్ యింకా రిలీజ్ కాలేదు. రాయల్టీ రాలేదు .... ఓ యాభై వుంటే సర్దుకోండి. మరోలా అనుకోకండి. మీరొచ్చి వెళ్ళినప్పట్నుంచీ ఆవిడ ఒకటే గొడవ-"చూడటాని కొస్తే మాత్రం-తేరగా చూసి అంత సేపు మాట్లాడనిస్తావా?" అని! ఆమె....ఆ పిల్లల పెళ్ళిళ్ళు....ఈబంధం...."

నేను చప్పున చొక్కాజేబులో చెయ్యి పెట్టి, చేతికి వచ్చిన ఐదుపదులూ ఆయన చేతిలో వుంచాను. తాను రాయబోయే మరో అద్భుత సాంఘిక కావ్యంలాంటి నవలలో-హీరోకు నా పేరు పెడతానన్నాడు. ఇంకా ఏదో చెప్పబోయాడుగానీ, నేను వినిపించుకోలా....శారదను వెంటబెట్టుక ఆలయాల వేపు సాగిపోయాను! లోపల ఆకాశమంత దేవుడుండగా, బయటంతా దోపిడీయే!

ఆ రాత్రికే ట్రెయినెక్కేశాం! ఇకవున్న డబ్బుచాలక కటకటపడాలని యిద్దరికీ తెలుసు!

ట్రెయిన్లో శారద చెబుతోంది.

"ఆ తెరల్లో ఏముందోనని మనం తరచి తరచి చూడకూడదండీ! ఆ కాలికి వూగే బంగారు దండవుంది చూడండి. దాన్నిబట్టి-అక్కడ జ్యోతిస్వరూపుడుగా .... వాయుస్వరూపుడుగా, చిదాకాశస్వరూపుడుగా స్వామి వున్నాడని మనం వూహించుకోవలసిందే! మనం ఇష్టమైన మూర్తి స్వరూపంగా ధ్యానించుకోవలసిందే! అందుకు భిన్నంగా ప్రవర్తించి, ఆయన అసలైన స్వరూపమేది? అంటూ తర్కానికి దిగి, చూడ ప్రయత్నించామో, చాలా దుఃఖం కలుగుతుందిట! మోక్షం రాదుట. దాన్నే మనవాళ్లు "చిదంబర రహస్యం" అంటారు!"

శారద తన ధోరణిలో తను వేదాంతం చెప్పుకుపోతోంది! అమాయకంగావున్న ఆమె ముఖం-ఏభై రెండేళ్ల-పండు ముత్తైదువ.... అద్భుతంగా వుంది.

హఠాత్తుగా ఏదో రహస్యం విడిపోయినట్టైంది నాకు.

నేను అద్భుత కావ్యాల్ని, నవలల్నీ, మరో కళనీ సృష్టించలేదు! ఘనసన్మానాలూ ప్రశంసలూ పొందలేదు...కానీ....నా ముగ్గురు బిడ్డల్నీ నాకున్న ఆర్థికపరిధిలో, నా నీతి నిజాయితీలకు వారసులుగా నిలపగలిగాను.... అందుకు నా శారద-ఈ దేవత "ఈమె" మౌనంగా మహోన్నతంగా....పరోక్షంగా ఎంతటి "ఇన్స్పిరేషన్" కలిగించింది!

నాలోని అణువణువూ ప్రేమతో పులకించిపోగా, చుట్టుప్రక్కల ప్రయాణీకులు గాఢ నిద్రలో వున్నారని తెలిసీ, ఆమె చెయ్యి పట్టుకున్నాను ఆప్యాయంగా .... "అవును శారదా! నువ్వు చెప్పింది నిజం!"

ఏభై రెండేళ్ల శారద—పండువెన్నెలలా నవ్వింది. □□

